క్లుప్తంగా

సహ చట్టంపై స్పందించని అధికారులు

దొనకొండ: దొనకొండ గ్రామ పంచాయతీ అధికారులు సమాచార హక్కు చట్టంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పంచాయతీ పరిధిలోని బేతేలుపురానికి చెందిన గంగవరపు విజయ్‌కుమార్ ఆరోపించారు. 2020 నుంచి 2024 వరకు పంచాయతీకి మంజూరైన గ్రాంట్లు, కర్చులు తదితర వివరాలు సమాచార హక్కు చట్టం ద్వారా గత అక్టోబర్‌లో కోరినా స్పందించలేదన్నారు. నవంబరులో ఈఓ ఆర్‌డీ షఫీ, జిల్లా పంచాయతీ అధికారి, సమాచార శాఖ కమిషనర్‌కు విన్నవించినా నేటికీ ఫలితం లేదని విజయకుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. సమాచార హక్కు చట్టాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని అధికారులు గొప్పలు చెప్పడమే తప్పా ఆచరణలో శూన్యమన్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమాచార హక్కు చట్టం ద్వారా తాము కోరిన సమాచారాన్ని అందజేయాలని ఆయన కోరారు. పంచాయతీ కార్యదర్శి కృష్ణమూర్తిని వివరణ కోరగా తాను రెండు నెలల క్రితమే విధుల్లో చేరానని, ఎటువంటి సమాచారం తమ దృష్టికి రాలేదని తెలిపారు.

భూముల రీసర్వే ప్రారంభం



రికార్డులు పరిశీలిస్తున్న సర్వేయర్లు

దొనకొండ: మండలంలోని వీర వెంకటాపురం గ్రామానికి చెందిన పొలాల్లో తహసీల్దార్ బి.రమాదేవి ఆదేశాల మేరకు రెవెన్యూ సిబ్బంది గురువారం భూముల రీ సర్వే ప్రారంభించారు. సచివాలయం సర్వేయర్లు ఆయా రైతులతో మాట్లాడి వారి భూముల సర్వే ప్రకారం రికార్డులు పరిశీలిస్తున్నారు. సుమారు 25 ఎకరాలు రీ సర్వే చేసి రికార్డు నమోదు చేశారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే రెవెన్యూ సిబ్బందికి తెలియజేయాలని రైతులను కోరారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ మాచర్ల, సర్వేయర్లు పాల్గొన్నారు.

సాయిబాబా మందిరంలో పూజలు



సాయిబాబాను దర్శించుకుంటున్న భక్తులు

పెద్దారవీడు: మండలంలోని చట్లమిట్లలో షిరిడీ సాయిబాబా మందిరంలో భక్తులు గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు సాయిబాబాకు అభిషేకాలు, పట్టు వస్త్రాలు, పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక హారతులిచ్చారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని కాయకర్పూరం సమర్పించి మొక్కులు చెల్లించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. దాతల సాయంతో ఆలయ ప్రాంగణంలో మధ్యాహ్నం స్వామిని దర్శించుకున్న భక్తులు, శ్రీశైలం వెళ్లే కాలినడక భక్తుల కోసం అన్నదానం చేశారు.

రాజయ్యకు డాక్టరేట్ ప్రదానం



రాజయ్య

యర్రగొండపాలెం: జిల్లా వికలాంగుల హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు గుమ్మా రాజయ్యకు సొతాఫి కాలోని ఎపికై జో ప్రొఫిటిక్ బైబిల్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఈ మేరకు గురువారం ఆయనకు ఆన్‌లైన్‌లో సర్టిఫికెట్ అందజేసింది. దివ్యాంగులకు చేస్తున్న సేవలను గుర్తించి తనకు డాక్టరేట్ ప్రదానం చేశారని రాజయ్య పేర్కొన్నారు.

మస్తాన్‌వలికి అవార్డు



అవార్డు అందుకుంటున్న మస్తాన్‌వలి

తాళ్లూరు: ఢిల్లీ వేదికగా సెంట్రల్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నేషనల్ యూత్ ఇన్స్పిరేషన్- 2025 అవార్డును మండలంలోని తూర్పు గంగవరం గ్రామానికి చెందిన షేక్ మస్తాన్‌వలి అందుకున్నారు. మస్తాన్‌వలి సెంట్రల్ ఎడ్యుకేషన్ మినిస్టర్ సతీష్ చందు ద్వివేది చేతుల మీదుగా గురువారం అవార్డు అందుకున్నారు. ఆయన తొలుత డెక్కన్ క్లబ్ పెయింటింగ్ వాటర్ ప్రూఫ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీని స్థాపించారు. దేశంలో 16 ప్రధాన నగరాల్లో 30 వేల మంది ఇంటి యజమానులకు పెయింటింగ్ వాటర్ ప్రూఫ్ సంబంధిత సర్వీసు అందిస్తున్నారు. ఈ విధానంపై ఇండియాలోని టాప్ ఫైవ్ పెయింటింగ్ వాటర్ ప్రూఫ్ ట్రైనర్స్‌లో ఒకరిగా మస్తాన్‌వలిని గుర్తించి అవార్డు అందించారు. మినిస్టర్ రూరల్ డెవలప్మెంట్, మినిస్టర్ డిఫెన్స్, మినిస్టర్ ఆఫ్ ఫుడ్ ప్రాసెసింగ్ అధికారులు పాల్గొన్నారు.

రోడ్లు ఇలా.. ప్రయాణం ఎలా?

- గుంతల మయంగా మారిన రోడ్లు
- ప్రమాదాల బారిన పడుతున్న వాహనాలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు



తమ్మలూరు సీసీ రోడ్డుపై గుంతలు



ఉల్లగల్లు ఎస్సీ కాలనీకి వెళ్లే రోడ్డు ఇలా..

ముండ్లమూరు (దర్శి):

ముండ్లమూరు మండలంలో రోడ్ల పరిస్థితి దయనీయంగా మారింది. వాహనాలపై ఎటు వైపు వెళ్లాలన్నా రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. తారు రోడ్లు సైతం మోకాళ్ల లోతు గుంతలు పడి ఆటోలు, కార్లు, మోటారు సైకిళ్లపై ప్రయాణం చేయాలంటే కష్టంగా మారింది. ఉల్లగల్లు నుంచి వేముల వెళ్లే రోడ్డు దారి పొడవునా గుంతలే కనిపిస్తున్నాయి. ఆటోలు వంటి నిత్యం ప్రయాణించే పాల వాహనాలు సైతం గుంతల్లో పడి మరమ్మతులకు గురవుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. ముండ్లమూరు నుంచి తమ్మలూరు వెళ్లే రోడ్డు పరిస్థితి మరింత దయనీయంగా మారింది. రోడ్డుపై ఎప్పుడు గుంతలు పడుతున్నాయో తెలియడం లేదు. మూల మలుపులు ఎక్కువగా ఉండి గుంతలు కనిపించక వాహనాలు గుంతల్లో పడి నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ఉల్లగల్లు నుంచి లక్ష్మీనగర్, ఏడు ముద్దలపాలెం వెళ్లే రోడ్డు పరిస్థితి కూడా ఇదే విధంగా ఉంది. డీజిల్ ధరలు మండిపోతున్న తరుణంలో రోడ్లు బాగుంటే ఆటోలు తోలుకుని జీవనం సాగించే వాహనదారులకు గిట్టుబాటు అవుతుంది. రోడ్లు ఈ విధంగా ఉంటే ప్రయాణాలు ఎలా చేయాలని, వాహనాలు గుల్లగుల్ల అవుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. గ్రామాలకు వెళ్లే ప్రధాన రోడ్లలో వేసిన సీసీ రోడ్లు సైతం గుంతలు పడి వాహనాలు నడిచేందుకు వీల్లేకుండా ఉన్నాయి. రోడ్లపై తారు, కంకర లేచి పెద్ద పెద్ద గుంతలు పడి వాహనాలు వెళ్లాలంటే ఇబ్బందికరంగా మారాయి. నిత్యం దమ్ము చక్రాలు తిరుగుతున్నా పట్టించుకునే వారు లేక కొన్ని రోడ్లు తారు లేచి గుంతలమయంగా మారుతున్నాయి. అధికారులు స్పందించి గుంతలు పూడ్చి నూతనంగా రోడ్లు నిర్మించాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు. ఇటీవల కాలంలో గుంతలు పూడ్చేందుకు మండలంలో రూ.25 లక్షల వరకు కేటాయించారు. ఎక్కడా గుంతలు పూడుస్తున్న దాఖలాలు కనిపించ లేదు. అధికారులు రోడ్లు బాగాలేని ప్రాంతాల్లో గుంతలు పూడ్చకుండా బిల్లులు చేసుకుని మమ అనిపిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. సంబంధిత అధికారులు దృష్టి సారించి మండలంలో రోడ్లకు మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.



గుంతలమయంగా ఉల్లగల్లు-వేముల రోడ్డు



అధ్వానంగా లక్ష్మీనగర్ వెళ్లే రోడ్డు

సోలార్‌ను వినియోగించుకోవాలి

- విద్యుత్ శాఖ ఈఈ శ్రీనివాసరావు



సోలార్ విద్యుత్ గురించి వివరిస్తున్న ఈఈ శ్రీనివాసరావు

కురిచేడు: మండలంలోని ప్రతి ఒక్కరూ కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పీఎం సోలార్ ఘర్ స్కీంను సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ శాఖ ఈఈ శ్రీనివాసరావు కోరారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో ఆయన గురువారం రాత్రి విద్యుత్ వినియోగదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సోలార్ విద్యుత్ ఏర్పాటు చేసుకునే వారికి రాయితీ ఇస్తోందన్నారు. ప్రతి కిలో వాట్ విద్యుత్ సోలార్ ప్యానల్‌కు రూ.30 వేల రాయితీ ఇస్తోందని తెలిపారు. మూడు కిలో వాట్ల విద్యుత్ ప్యానల్‌కు రూ.68 వేల రాయితీ ఇస్తోందన్నారు. ఒక కిలో వాట్ సోలార్ ప్యానల్ ద్వారా నెలకు 100 యూనిట్ల వరకు విద్యుత్ ఉత్పత్తి చేసుకోవచ్చన్నారు. ఒక కిలోవాట్ సోలార్ ప్యానల్ పూర్తి ఖరీదు రూ.1.10 లక్షలన్నారు. వినియోగదారులు వినియోగించుకోగా మిగిలిన విద్యుత్‌ను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తెలిపారు. ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల వరకు విద్యుత్ బిల్లులు లేకుండా ప్రభుత్వం ఉచితం చేసిందని, దానికి బదులు రెండు కిలోవాట్ల విద్యుత్ ప్యానల్‌ను వారికి ఉచితంగా ఏర్పాట్లు చేస్తోందని ఈఈ శ్రీనివాసరావు వివరించారు. ఏడీఈ కృష్ణారెడ్డి, ఏఈ రామకృష్ణ, లైన్ ఇన్‌స్పెక్టర్లు షేక్ బికారిషా, శ్రీనివాసరావు, సిబ్బంది, వినియోగదారులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో బొప్పాయి అధిక దిగుబడి



సదస్సులో మాట్లాడుతున్న జనరల్ మేనేజర్ సందీప్ కులకర్ణి

యర్రగొండపాలెం: సేంద్రియ ఎరువులతో బొప్పాయి పంటలో అధిక దిగుబడులు సాధించవచ్చని కెనొన్ యూ సీడ్ వైస్ జనరల్ మేనేజర్ సందీప్ కులకర్ణి అన్నారు. గురువారం స్థానిక ఆదిత్య విద్యా సంస్థల సముదాయంలో రైతులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. సేంద్రియ ఎరువులు వాడటంతో భూమి స్వభావంలో ఎటువంటి మార్పులు రాకుండా అధిక దిగుబడులు వచ్చేందుకు సహకరిస్తుందన్నారు. 30 ఏళ్ల నుంచి రసాయనక ఎరువులు ఎక్కువగా వాడుతుండటంతో భూమి స్వభావం పూర్తిగా మారిపోయిందని, అందులో పండిస్తున్న పంటలు కలుషితంగా మారుతున్నాయని, దీంతో మానవాళి ఆరోగ్య పరిస్థితులు దారుణంగా ఉంటున్నాయని, దిగుబడులు కూడా తగ్గిపోతుండటంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. ఇటువంటి పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని తమ కంపెనీ అన్ని నేలల్లో పండే బొప్పాయి రెడ్ లేడీ 786 రకాన్ని రైతులకు పరిచయం చేస్తుందని, ఈ రకం పంటతో ఎకరాకు 23 నుంచి 30 టన్నుల దిగుబడులు సాధించ వచ్చని పేర్కొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా తమ కంపెనీ బ్రాంచీలు 186 దేశాల్లో ఉన్నాయని, వచ్చే ఏడాది నుంచి యర్రగొండపాలెంలో తమ బ్రాంచిని ఏర్పాటు చేసి రైతులకు అందుబాటులోకి తీసుకొస్తామని పేర్కొన్నారు. సదస్సులో నేషనల్ సేల్స్ మేనేజర్ రెహన్ అహ్మద్, సౌత్ జోన్ జనరల్ మేనేజర్ అరవింద్ భాల్కె, హైదరాబాద్ బ్రాంచి మేనేజరు తన్మయదాస్, ఏజెంట్లు సూరె ప్రసాద్, చిలకల అంకిరెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత



ర్యాలీని ప్రారంభిస్తున్న ఆర్టీఓ అమర్‌నాయక్, సీఐ సుబ్బారావు

మార్కాపురం: రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత అని ఆర్టీఓ అమర్‌నాయక్ పేర్కొన్నారు. జాతీయ రహదారి భద్రతా కార్యక్రమాల్లో భాగంగా గురువారం పట్టణంలోని ఎస్‌వీకేపీ కళాశాల నుంచి నాయుడుబజారు, తేరు బజారు మీదుగా మెయిన్ బజారు వరకు విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆర్టీఓ మాట్లాడుతూ.. రోడ్లపై వాహనాలను జాగ్రత్తగా నడపాలని డ్రైవర్లకు సూచించారు. ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ.. జాగ్రత్తగా వాహనాలు నడపాలని చెప్పారు. టూవీలర్స్ నడిపేవారు హెల్మెట్ ధరించాలని సీఐ సుబ్బారావు, ఎంవీఐ మాధవరావు విజ్ఞప్తి చేశారు. లైసెన్సు లేకుండా వాహనాలు నడపవద్దన్నారు. పరిమితికి మించి కూలీలను, ప్రయాణికులను ఎక్కించుకోవద్దని డ్రైవర్లకు స్పష్టం చేశారు. క్షేమంగా వెళ్లి లాభంగా రావాలనే సూక్తిని ప్రతి ఒక్కరూ గుర్తుచేసుకొని వాహనం నడపాలని కోరారు. కార్యక్రమంలో బ్రేక్ ఇన్‌స్పెక్టర్ రామచంద్రరావు, ఆర్టీసీ డీఎం నరసింహులు, పట్టణ, రూరల్ ఎస్సైలు సైదుబాబు, అంకమరావు, డాక్టర్ రాజమోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కంభం: ఆటోల్లో రైతు కూలీలను పరిమితికి మించి తీసుకెళ్తే చర్యలు తప్పవని కంభం సీఐ కె.మల్లికార్జున హెచ్చరించారు. మండలంలోని జంగంగుంట్ల గ్రామంలో గురువారం సాయంత్రం ఎస్సై బి.నరసింహారావుతో కలిసి వాహనాలు తనిఖీలు చేశారు. ఆటోల్లో ఇతర ప్రాంతాలకు మిర్చి, పొగాకు పనులకు వెళ్లి వస్తున్న వారిని ఆపి అవగాహన కల్పించారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుని వెళ్లే సమయాల్లో ఏవైనా ప్రమాదాలు జరిగితే ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుందన్నారు. ఆటో డ్రైవర్లు రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తూ వాహనాలు నడుపుకోవాలని, లేని పక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

నేడు ప్రగళ్లపాడులో భూముల రీ సర్వే

పెద్దారవీడు: మండలంలోని బద్వీడు పంచాయతీ ప్రగళ్లపాడు గ్రామంలో రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో భూముల రీసర్వే శుక్రవారం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శైలేంద్రకుమార్ గురువారం సాయంత్రం తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మార్కాపురం సబ్ కలెక్టర్ త్రివినాగ్ హాజరవుతారని పేర్కొన్నారు. భూముల రీసర్వే కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సుభాష్ చంద్రబోస్‌కు నివాళి



నేతాజీకి నివాళులర్పిస్తున్న హెచ్‌ఎం చంద్రశేఖర్, ఉపాధ్యాయులు

పెద్దారవీడు: నేతాజీ సుభాస్ చంద్రబోస్ జయంతి సందర్భంగా మండలంలోని ప్రగళ్లపాడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గురువారం ఆయన చిత్రపటానికి హెచ్‌ఎం జి.చంద్రశేఖర్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ సుభాస్ చంద్రబోస్ గొప్ప దేశ భక్తుడని, స్వాతంత్ర్య సమరంలో పోరాడిన గొప్ప మహా నాయకుడని కొనియాడారు. పోరాటానికి వెనకాడని వారని, ప్రపంచానికి చాటి చెప్పిన మహోన్నత అతివాద నాయకుడని, ఆతని జీవితం భావితరాలకు ఒక పుస్తకం లాంటిదని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు పి.రాంశేఖర్, అంగన్‌వాడీ టీచర్ ఎం.ఆవులక్క, విద్యార్థులు పాల్గొన్నారు.

దర్శి: మండలంలోని పోతవరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు ధనిరెడ్డి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ముందుగా నేతాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతూ నేటి తరం పిల్లలు నేతాజీ అడుగుజాడల్లో నడవాలని, దేశభక్తి పెంపొందించుకోవాలని ఉద్బోధించారు. దేశ నాయకుల జీవిత చరిత్రలు భావితరానికి స్ఫూర్తిని కలిగిస్తాయన్నారు. అనంతరం పిల్లలకు మిఠాయిలు పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు ఎం. మాధవి, డి.బసంతి, పి.ఖాశిం పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి



జామ పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, దళిత బహుజన సెంటర్ నాయకులు

ముండ్లమూరు (దర్శి): జామపంటలో సమగ్ర విధానంలో యాజమాన్య పద్ధతులు పాటించాలని దర్శి కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ జి.రమేష్ తెలిపారు. పంట తెగులు, వాటి నివారణకు ఏయే మందులు వాడుతున్నారో, పిచికారీ చేసే విధానం, వాటి లోపాల నివారణకు తగు సలహాలు, సూచనలు రైతుకు తెలియజేశారు. దళిత బహుజన రీసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో ముండ్లమూరులో ఎస్సీ రైతు పునుగుబాటి నరసింహారావు ఎస్సీ సబ్‌ప్లాన్ నిధుల ద్వారా సాగు చేసిన మునగ పంట రకం పీకే వన్ క్షేత్రస్థాయి సందర్శన గురువారం చేశారు. అనంతరం జామపంటను కూడా పరిశీలించి రైతు నాగార్జునరెడ్డికి యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. కృషి విజ్ఞాన కేంద్రం సేద్య విభాగం శాస్త్రవేత్త ఎల్.వెంకటేశ్వరరెడ్డి, డీబీఆర్‌సీ రీజనల్ కో ఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు, గ్రామ వ్యవసాయ సహాయకురాలు టి.శోభారాణి, డీబీఆర్‌సీ ఏరియా కో ఆర్డినేటర్ తప్పెట డేవిడ్, రైతులు పాల్గొన్నారు.

చంద్రారెడ్డికి ఎమ్మెల్యే బూచేపల్లి నివాళి



చంద్రారెడ్డికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి, వెంకాయమ్మ



సీమోనుకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి

తాళ్లూరు: మండలంలోని దోసకాయలపాడు వైఎస్సార్ సీపీ కార్యకర్త వై.జనార్దన్‌రెడ్డి తండ్రి చంద్రారెడ్డి దశదిన కర్మ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పాల్గొన్నారు. చంద్రారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. మండలంలోని తూర్పు గంగవరంలో పార్టీ కార్యకర్త చాట్ల సీమోన్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న వారు అక్కడకు వెళ్లి సీమోన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి, ధైర్యాన్నిచ్చారు. మండల పార్టీ అధ్యక్షుడు తూము సుబ్బారెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఐవీ సుబ్బారెడ్డి, పోశం మధుసూదన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మోషే, సర్పంచ్‌లు మారం ఇంద్రసేనారెడ్డి, కోట శివలక్ష్మి, వెంకటరామిరెడ్డి, ఉప సర్పంచ్ పులి ప్రసాద్, జక్కుల రామకృష్ణ, గుజ్జుల తిరుపతిరెడ్డి, సంగు కొండారెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో పలువురికి పదవులు

దర్శి: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు దర్శి నియోజకవర్గ అనుబంధ సంఘాలకు అధ్యక్షుల నియామకాన్ని పార్టీ జిల్లా అధ్యక్షుడు, శాసనసభ్యుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి నియమించారు. యువజన అధ్యక్షుడిగా ఇరుగుల శ్రీనివాసరెడ్డి, మహిళా అధ్యక్షురాలిగా ఆవుల జ్యోతి, రైతు విభాగం అధ్యక్షుడిగా బంకా నాగిరెడ్డి, బీసీ సెల్ అధ్యక్షుడిగా నిమ్మకాయల రాజయ్య, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా పల్లెపోగు ఏసుదాసు, ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా జగన్నాథం మోహన్‌బాబు, మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా షేక్ అమీన్‌బాషా, క్రిస్టియన్ మైనార్టీసెల్ అధ్యక్షుడిగా జి.కృపానాదం, స్టూడెంట్ విభాగం అధ్యక్షుడిగా వై.మహేంద్రరెడ్డి, పంచాయతీ రాజ్ విభాగం అధ్యక్షుడిగా మేరువ సుబ్బారెడ్డి, మున్సిపల్ విభాగం అధ్యక్షుడిగా టి.బాబూరావు, ఆర్‌టీఐ విభాగం అధ్యక్షుడిగా బల్లగిరి శ్రీను, వలంటీర్ల విభాగం అధ్యక్షుడిగా కె.ఆంజనేయరెడ్డి, గ్రీవెన్‌సెల్ అధ్యక్షుడిగా జి.మోషే, వాణిజ్య విభాగం అధ్యక్షుడిగా పి.సాంబశివరావు, వీవర్స్ వింగ్ అధ్యక్షుడిగా వి.నరేష్, వైఎస్సార్‌టీయూసీ అధ్యక్షుడిగా బొమ్మిరెడ్డి లక్ష్మీరెడ్డి, అంగన్‌వాడీ వింగ్ అధ్యక్షుడిగా పాలం నాగలక్ష్మమ్మ, లీగల్ సెల్ అధ్యక్షుడిగా వై.రమణారెడ్డి, కల్చరల్ వింగ్ అధ్యక్షుడిగా జక్కుల రామకృష్ణ, సోషల్ మీడియా వింగ్ అధ్యక్షుడిగా ఒంటేరు మల్లికార్జున యాదవ్, ఐటీ వింగ్ అధ్యక్షుడిగా దుగ్గిరెడ్డి నాగేంద్రరెడ్డి, దివ్యాంగుల విభాగం అధ్యక్షుడిగా ముండ్ల వెంకట రమణ, డాక్టర్స్ వింగ్ అధ్యక్షుడిగా ఏ.శ్రీనివాసరెడ్డి, ఇంటిలెక్చువల్ ఫోరం అధ్యక్షుడిగా వీరగంధం కోటయ్య, బూత్ కమిటీ అధ్యక్షుడిగా కల్లూరి రమణయ్య, పబ్లిసిటీ వింగ్ అధ్యక్షుడిగా వై. మధుసూదన్‌రెడ్డిలను నియమించినట్లు ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి తెలిపారు.

అసంపూర్తిగా అంగన్‌వాడీ భవన నిర్మాణాలు



బేతేలుపురంలో అసంపూర్తిగా నిలిచిన అంగన్‌వాడీ భవన నిర్మాణం

దొనకొండ: మండలంలోని పలు గ్రామాల్లో నిర్మాణంలో ఉన్న నూతన అంగన్‌వాడీ భవన నిర్మాణాలు అసంపూర్తిగా నిలిచాయి. మండలంలో 18 గ్రామ పంచాయతీల్లో 63 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వాటిలో 39 ప్రభుత్వ భవనాలు కాగా 17 అద్దె భవనాల్లో ఉన్నాయి. 8 మాత్రం ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్నారు. గత ప్రభుత్వంలో నాడు-నేడు కార్యక్రమం కింద దొండపాడు, బేతేలుపురం, చందవరం ఎస్సీ కాలనీలో ఒక్కో దానికి రూ.13 లక్షల మేర నిధులు మంజూరు చేయడంతో నూతన భవనాల నిర్మాణం చేపట్టారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక అంగన్‌వాడీ భవన నిర్మాణాలు పూర్తిగాక ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు తయారైంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అసంపూర్తిగా నిలిచిన అంగన్‌వాడీ కేంద్రాల భవన నిర్మాణాలు పూర్తి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై సీడీపీఓ భారతీని వివరణ కోరగా భవనాల నిర్మాణం వచ్చే ఏడాదికి అవసరమైన నిధుల కోసం ప్రతిపాదనలు పంపించామని పేర్కొన్నారు. నిధులు మంజూరైతే అంగన్‌వాడీ భవనాలు నిర్మాణం పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని సీడీపీఓ తెలిపారు.